www.XtremePapers.com

UNIVERSITY OF CAMBRIDGE INTERNATIONAL EXAMINATIONS
General Certificate of Education Advanced Level

**TELUGU** **9690/02**

Paper 2 Reading and Writing **October/November 2012**

**1 hour 45 minutes**

Additional Materials: Answer Booklet/Paper

*3010915573*

**READ THESE INSTRUCTIONS FIRST**

If you have been given an Answer Booklet, follow the instructions on the front cover of the Booklet.
Write your Centre number, candidate number and name on all the work you hand in.
Write in dark blue or black pen.
Do not use staples, paper clips, highlighters, glue or correction fluid.

Answer **all** questions.
Write your answers in **Telugu** on the separate answer paper provided.
Dictionaries are **not** permitted.
You should keep to any word limits given in the questions.

At the end of the examination, fasten all your work securely together.
The number of marks is given in brackets [ ] at the end of each question or part question.

**ఈ సూచనలను ముందుగా చదవండి.**

మీకిచ్చిన సమాధాన పత్రంలోని ముఖపత్రం మీది సూచనలను పాటించండి.
నిర్దేశించిన స్థలాలలో మీ సమాధాన పత్రం/పత్రసంపుటి మీద మీ పేరు, కేంద్రం సంఖ్య, అభ్యర్థి సంఖ్య రాసి నింపండి.
ముదురు నీలం లేదా నలుపు రంగు సిరా కలాలనే వాడండి.
స్టేపిల్సు, పేపరు క్లిప్పులు, హైలైటర్లు, గ్లూ లేదా చెరుపుడు ద్రవాలు వాడకండి.

**అన్ని** ప్రశ్నలకు సమాధానాలు రాయండి.
అందించిన సమాధాన పత్రంలో మీ సమాధానాలను **తెలుగు**లో రాయండి.
పదకోశాలకు అనుమతి లేదు.
ప్రశ్నల్లో సూచించబడ్డ పదపరిమితిని పాటించండి.
పరీక్ష కాగానే సమాధాన పత్రాలను అన్నిటినీ ఒకటిగా గుదికూర్చి కట్టండి.
ప్రతి ప్రశ్నకు లేదా ప్రశ్నాంశానికి చివర [ ] కుండలీకరణం గుర్తుల్లో గుణాలు సూచించబడ్డాయి.

This document consists of **5** printed pages and **3** blank pages.


© UCLES 2012
UNIVERSITY of CAMBRIDGE International Examinations

## విభాగం 1

ముందుగా ఈ మొదటి పాఠ్యాన్ని చదివి, ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు **తెలుగు**లో జవాబులు రాయండి.

### సంక్రాంతి ముగ్గులు

దారాసింగ్ పంజాబుకు చెందినవాడు. అతను ఉద్యోగ రీత్యా ఆంధ్రప్రదేశ్‌లో ఉంటున్నాడు. అతని తల్లిదండ్రులు పంజాబ్‌లోనే ఉంటారు. అతను రఘురామ్ పనిచేసే ఆఫీసులో పనిచేస్తున్నాడు. రఘురామ్ సంక్రాంతికి తన ఊరికి వెళ్తూ దారాసింగ్‌ను కూడా రమ్మన్నాడు. దారాసింగుకు సంతోషం కలిగింది. ఆంధ్రదేశం లోని గ్రామాలను చూడాలని అతనికి చాలా రోజులుగా ఒక కోరిక ఉంది. ఎందుకంటే దారాసింగ్ పంజాబు లోని ఒక గ్రామంలో పుట్టాడు. అతని చిన్నతనం అంతా ఆ గ్రామంలోనే గడిచింది. అక్కడి వ్యవసాయపు పనుల గురించి అతనికి బాగా తెలుసు. అక్కడ గోధుమ బాగా పండుతుంది. ఆంధ్రప్రదేశ్ లోని తీర ప్రాంత గ్రామాలలో వరి బాగా పండుతుంది. అక్కడి వ్యవసాయానికీ ఇక్కడి వ్యవసాయానికీ ఉన్న తేడా లేమిటి పోలిక లేమిటి తెలుసుకోవా లనే కుతూహలం అతనికి చాలా గట్టిగా ఉంది. అందుకని రఘురామ్ పిలవగానే వెంటనే ఒప్పుకున్నాడు.

ఈ సారి సంక్రాంతి శుక్రవారం నాడు వచ్చింది. గురువారం సాయంత్రం ఆఫీసు కాగానే ఇద్దరూ మోటారుసైకిలు మీద బయల్దేరారు. ఇంటికి చేరుకునే సరికి రాత్రి 7: 30 అయింది. రఘురామ్ దారాసింగును ఇంట్లోవాళ్ళందరికీ పరిచయం చేశాడు. పంజాబ్‌కు చెందిన దారాసింగు తమ ఇంటికి వచ్చినందుకు ఇంట్లో అందరూ ఎంతో ఆనందించారు.

రఘురామ్ తండ్రి వ్యవసాయదారుడు. ఆయన దారాసింగ్ తల్లిదండ్రుల గురించి, అన్నదమ్ముల గురించి, అక్కచెల్లెళ్ళ గురించి, వారి యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నాడు. అతని ఊరు, అక్కడి వాతావరణం, పొలాలు, పంటలు, వ్యవసాయ పద్ధతులు, మొదలైన విషయాల గురించి ఎన్నో ప్రశ్నలు అడిగాడు. ఇక్కడి వ్యవసాయంలోని లాభ నష్టాల గురించి కథలు కథలుగా చెప్పాడు. ఆయన కథలుగా చెప్తూ ఉంటే దారాసింగుకు చిన్నతనంలో తన తాతయ్య కథలు చెప్పటం గుర్తుకు వచ్చింది. తాతయ్య కథ చెప్తే కళ్ళకు కట్టినట్లుండేది. ఎప్పటికీ గుర్తుండేటట్లు చెప్పేవాడు. చెప్పేవాళ్ళ చాతుర్యం వల్ల వినేవాళ్ళకు కలిగే లాభం ఎటువంటిదో తానే సాక్ష్యం. కథ చెప్పటంలోనే కాదు ఏదైనా విషయం చెప్పటంలో కూడా తాతయ్య నేర్పరితనం చాలా గొప్పది. ఆయన చెప్పిన విషయాలు తనకు ఇప్పటికీ చక్కగా గుర్తుండిపోయాయి. మళ్ళీ ఇప్పుడు రఘురామ్ తండ్రి చెప్పే విధానం కూడా అట్లానే ఉంది.

పండగ నాడు పొద్దున్నే అందరూ పెందలాడి లేచారు. ఇంట్లో సందడి చూసి దారాసింగుకు సంతోషం కలిగింది. రఘురామ్ ఇద్దరు చెల్లెళ్ళూ చీకటితోనే లేచి ఇంటి ముందు పెద్దపెద్ద ముగ్గులు పెట్టారు. వాటి మీద పసుపు, కుంకుమ, రకరకాల పూలరేకులు చల్లారు. వాటి మధ్య బంతి పూలతో అలంకరించిన గొబ్బెమ్మలు పెట్టారు. దారాసింగ్ స్నానం చేసి బయటికి వచ్చాడు. వస్తూనే ఆశ్చర్యంతో అట్లా నిలుచుండిపోయాడు.

నేల మీద ఒక్క అంగుళం కూడా ఖాళీ లేకుండా ప్రతివారూ తమ ఇంటి ముందు ఉన్న వీధి దారి అంతా ముగ్గులతో నింపేశారు. పసుపు, కుంకుమ, రంగురంగుల పూలరేకులు చల్లి వేసిన ముగ్గులు వీధి అంతా నిండి కనువిందు చేస్తున్నాయి. ఒక చక్కని క్రమంలో పెట్టిన చుక్కల చుట్టూ అందంగా అల్లుకుంటూ తిరిగివచ్చే రేఖలతో కన్నుల పండుగ చేసే ముగ్గులు అతన్ని విస్మయంతో కూడిన ఆనందంలో ముంచివేశాయి. ఆ ముగ్గులలో ఏ రెండు ముగ్గులూ ఒకే రకంగా లేకుండా వైవిధ్యంతో నిండి ఉన్నాయి. అవి ఎంతో కళాత్మకంగానూ వింత శోభతోనూ అలరారుతున్నాయి. ఆ ముగ్గులు దారాసింగును ఎంతగా అలరించాయంటే అతనా రోజు ఎవరితో మాట్లాడినా ముగ్గుల గురించి, వాటి సోయగాన్ని గురించే మాట్లాడుతూ ఉండిపోయాడు.

© UCLES 2012

**1** దిగువ పేర్కొన్న అర్థ వివరణలకు బాగా సరిపోయే పదాలు/పదబంధాలు పై పాఠ్యంలో ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి.

మాదిరి: కాంక్ష
సమాధానం: కోరిక

(అ) అంగీకరించాడు [1]
(ఆ) సంతోషించారు [1]
(ఇ) సంగతులు [1]
(ఈ) ఉదయమే [1]
(ఉ) గీతలు [1]

[మొత్తం గుణాలు 5]

**2** కింద సూచించిన పదాలను/పదబంధాలను వాటి అర్థం వ్యక్తం అయ్యేలా మీ సొంత వాక్యాలలో ఉపయోగించి రాయండి.

మాదిరి: సందడి
సమాధానం: పెళ్ళివారింట్లో చాలా సందడిగా ఉంది.

(అ) పోలిక [1]
(ఆ) పరిచయం [1]
(ఇ) పెందలాడి [1]

బ్రాకెట్లలో సూచించిన పదాలను/పదబంధాలను ఉపయోగించి వాక్యాలను తిరగరాయండి.

మాదిరి: ఇంట్లో సందడి చూసి దారాసింగుకు సంతోషం కలిగింది. [సంతోషం కలిగించింది]
సమాధానం: ఇంట్లో సందడి దారాసింగుకు సంతోషం కలిగించింది.

(ఈ) ఆంధ్రదేశం లోని గ్రామాలను చూడాలని అతనికి చాలా రోజులుగా ఒక కోరిక ఉంది. [చూడాలనేది] [1]
(ఉ) వాటి మధ్య బంతి పూలతో అలంకరించిన గొబ్బెమ్మలు పెట్టారు. [గొబ్బెమ్మలను బంతిపూలతో అలంకరించి] [1]

[మొత్తం గుణాలు 5]

**3** మీది పాఠ్యంలోని వాక్యాలనే మక్కికి మక్కి దించకుండా కింది ప్రశ్నలకు మీ సొంత వాక్యాలలో సమాధానాలు రాయండి.
(ప్రతి ప్రశ్న చివర గుణాలు గుర్తించబడ్డాయి. భాషా పాటవానికి అదనంగా 5 గుణాలు ఉన్నాయి. వెరసి ఈ ప్రశ్నకు మొత్తం 15 + 5 = 20 గుణాలు.)

(అ) దారాసింగును గురించి నాలుగు అంశాలు తెలపండి. [4]
(ఆ) రఘురామ్ దారాసింగులు ఎప్పుడు బయల్దేరారు? ఎప్పుడు చేరుకున్నారు? [2]
(ఇ) రఘురామ్ తండ్రి దారాసింగును ఏయే విషయాల గురించి అడిగాడు? [2]
(ఈ) రఘురామ్ చెల్లెళ్ళు చీకటితోనే లేచి ఏం చేశారు? [3]
(ఉ) వీధిలో ముగ్గులు ఎట్లా ఉన్నాయో వివరించండి. [4]

[మొత్తం గుణాలు 20]

## విభాగం 2

ఇప్పుడు ఈ దిగువ నున్న రెండో పాఠ్యాన్ని చదివి, ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు తెలుగులో జవాబులు రాయండి.

### తాతయ్య కథలు

పిల్ల లందరూ తాతయ్య చుట్టూ చేరారు. తాతయ్య వాళ్ళకు ఎన్నో కథలు చెప్తున్నాడు. ఆ కథలను వాళ్ళు ఎంతో ఆసక్తిగా వింటున్నారు. వాళ్ళలో గోపి అందరి కంటె పెద్దవాడు. తాతయ్య చెప్పే ఈ కథ లన్నీ అతను ఇంతకు ముందు ఎన్నో సార్లు విన్నాడు. తాతయ్య చెప్పే కథలను అతను తన పద్ధతిలో మార్చి స్కూల్లో తన స్నేహితులకు, విహారయాత్రలకు వెళ్ళినప్పుడు కథలు చెప్పే కార్యక్రమాలలోనూ చెప్తూ ఉంటాడు. గోపికి ఇటువంటి చిత్రవిచిత్రమైన కథలు ఎట్లా తెలుసా అని అతని స్నేహితులు అందరూ ఆశ్చర్య పోతూ ఉంటారు. కథలు చెప్పే పోటీ కార్యక్రమాల్లో ఎప్పుడూ అతనికే మొదటి బహుమతి.

తాతయ్య కథలు చెప్పే పద్ధతి చాలా ఆసక్తికరంగా ఉంటుంది. కథను మొదలు పెట్టటంలోనే ఒక మంచి ఎత్తుగడతో మొదలు పెడ్తాడు. ఆయన మధ్యమధ్యలో కథను చెప్పటం ఆపుతాడు. అప్పుడు పిల్లలందరూ ''చెప్పు తాతయ్యా! తర్వాత ఏమైంది తాతయ్యా?'' అంటూ ఎగబడతారు. ''అబ్బ! తాతయ్య ఎప్పుడూ ఇంతే: కథ మంచి పట్టులో ఉండగా ఆపేస్తాడు.'' అంటూ చిరు కోపం ప్రదర్శిస్తారు. ''ఇట్లా అయితే నీ చేత కథలు చెప్పించుకోము'' అంటూ బెదిరిస్తారు కూడా.

అప్పుడు తాతయ్య, ''ఆగండ్రా! కొంచెం మంచినీళ్ళు తాగనివ్వండి.'' అంటాడు. అప్పుడు పిల్లలందరూ లేచి ఒకరి కంటె ఒకరు ముందుగా మంచినీళ్ళు తెచ్చి ఇవ్వాలనే ప్రయత్నంలో పరిగెత్తుకుంటూ వెళ్తారు. వెళ్ళి తలా ఒక గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి తాతయ్యకు ఇవ్వబోతారు. అప్పుడు తాతయ్య, ''ఆగండ్రా! నాకు కావాల్సింది ఒక్క గ్లాసు. ఎవరు తెచ్చిన నీళ్ళు తాగమంటారు?'' అంటాడు దీర్ఘాలు తీస్తూ. నేను తెచ్చినవి తాగమంటే నేను తెచ్చినవి తాగమంటూ ఎగబడతారు పిల్లలు. ''ఆగండి, నాకు కావాల్సిన నీళ్ళు నేనే వెళ్ళి తాగి వస్తాను'' అంటూ లేచి వెళ్ళి మంచినీళ్ళు తాగి వస్తాడు తాతయ్య. అప్పుడు మొదలు పెడ్తాడు మళ్ళీ కథను.

కథనం ఇట్లా సాగుతూ ఉండగా ఈ కథలన్నీ ఇంతకు ముందే ఎన్నో సార్లు విన్న గోపి అడ్డు తగుల్తాడు. ''ఈ కథ లన్నీ ఎప్పుడూ చెప్పేవే! వాటిని కాసేపు ఆపి, నీ చిన్నతనం విశేషాలు చెప్పు తాతయ్యా!'' అంటాడు. ''ఆగరా! ముందీ కథ కానీ.'' అంటూ కథనం కొనసాగిస్తాడు తాతయ్య. మధ్యలో ఎప్పుడు దారి మారుతాడో ఎవ్వరూ గుర్తించ లేనంతగా కథలో నించి తన బాల్యం నాటి విశేషాలలోకి వెళ్ళిపోతాడు. తాతయ్య కథలో నించి తన బాల్యం నాటి విశేషాలలోకి వెళ్ళిపోవటం ఒక చమత్కారం. కథలో ఒక సన్నివేశాన్ని ఆసక్తికరంగా చెప్తూనే – సరీగ్గా ''ఇట్లాంటి సంఘటనే ఒకసారి జరిగిందర్రా!'' అంటూ కథలోనించి బయటికి వచ్చి తన అనుభవాలను చెప్పటం లోకి వచ్చేస్తాడు. వాటిని కూడా కథ లాగే కళ్ళకు కట్టినట్లు చెప్తాడు. అందువల్ల పిల్లలు తాతయ్య కథ చెప్తున్నాడో, తన అనుభవాలు చెప్తున్నాడో గుర్తించలేక అట్లాగే చెవులప్పగించి వింటూ ఉండిపోతారు. తాతయ్య వయసులో ఉండగా ఎన్నో ప్రాంతాలు తిరిగాడు. రకరకాల జీవన విధానాలను చూశాడు. ఆ విధంగా ఏర్పడ్డ తన అనుభవాలన్నిటినీ కథలలో రంగరించి చెప్తాడు. అందువల్ల ఆయన చెప్పే కథలు ఎన్ని సార్లు విన్నా ఏదో కొత్తదనంతో వినేవారిని ఆకట్టుకుంటాయి.

గోపికి కూడా కథ చెప్పటంలో తాతయ్య ధోరణు లన్నీ పట్టుబడ్డాయి. వాటికి తోడు, రకరకాల కథలు వినీవినీ మంచి సృజన శక్తి కూడా అలవడింది. అందువల్ల గోపి తన వయసు పిల్లలలో మంచి కథకుడుగా పేరు పొందాడు.

**4** పై పాఠ్యం లోని వాక్యాలనే ముక్కికి ముక్కి దించకుండా కింది ప్రశ్నలకు **తెలుగు**లో మీ సొంత వాక్యాలలో సమాధానాలు రాయండి.
(ప్రతి ప్రశ్న చివర గుణాలు గుర్తించ బడ్డాయి. భాషా పాటవానికి అదనంగా 5 గుణాలు ఉన్నాయి. వెరసి ఈ ప్రశ్నకు మొత్తం 15 + 5 = 20 గుణాలు.)

(అ) కథ చెప్పటంలో గోపి ప్రతిభ ఎటువంటిది? [3]
(ఆ) తాతయ్య కథ చెప్పటం ఆపినప్పుడు పిల్లలు ఏం చేస్తారు? [3]
(ఇ) తాతయ్య మంచినీళ్ళు తాగాలి అన్నప్పుడు పిల్లలు ఏం చేస్తారు? [2]
(ఈ) తాతయ్య తన చిన్ననాటి అనుభవాలను కథలోకి ఎట్లా తీసుకువస్తాడు? [3]
(ఉ) తాతయ్య కథలు వినేవారిని ఎందుకు ఆకట్టుకుంటాయి? [2]
(ఊ) గోపికి మంచి కథకుడుగా పేరు రావటానికి కారణాలు ఏమిటి? [2]

[మొత్తం గుణాలు 20]

**5** ఈ కింది ప్రశ్నలకు మీ సమాధానం మొత్తం 140 పదాలకు మించకుండా **తెలుగు**లో రాయండి.
(అ) ఇప్పుడు మీరు చదివిన రెండు పాఠ్యాలలో కథలు చెప్పటంలోని ఆకర్షణీయతను గురించిన అంశాల సారాంశాన్ని రాయండి. [10]
(ఆ) మీ పరిచయస్థులలో ఆసక్తికరంగా కథలు చెప్పేవారితో మీ అనుభవాన్ని తెలపండి. [5]

[భాషా పాటవానికి 5]

[మొత్తం గుణాలు 20]

**BLANK PAGE**

© UCLES 2012 

**BLANK PAGE**

© UCLES 2012

**BLANK PAGE**

Permission to reproduce items where third-party owned material protected by copyright is included has been sought and cleared where possible. Every reasonable effort has been made by the publisher (UCLES) to trace copyright holders, but if any items requiring clearance have unwittingly been included, the publisher will be pleased to make amends at the earliest possible opportunity.

University of Cambridge International Examinations is part of the Cambridge Assessment Group. Cambridge Assessment is the brand name of University of Cambridge Local Examinations Syndicate (UCLES), which is itself a department of the University of Cambridge.